# "ప్రేమకు వేళాయెరా!"

-బి. విజయ

గౌరవ సూచకంగా లేచి నిలబడిన విద్యార్థుల వైపొకసారి చిరునవ్వులు చిందిస్తూ, అభిమాన పూర్వ కంగా చూసి కూర్చోమన్నట్టు సైగచేసి కుర్చీలో కూర్చున్నాడు రాజారాం. హాజరు వేసి, పాఠం చెప్ప డానికని లేచాడు. ముందు బెంచీలో కూర్చున్న రాణి టెక్ట్స్ బుక్ తెచ్చి ఇచ్చింది. గొంతు సవరించుకుని 'డియర్ స్టూడెంట్స్! టు డే ఐ యామ్ టెల్లింగ్ ది లెస్సన్ "Farewell to Friend, It is a great poem written by అంటూ ఆ పాఠం తీయగానే రెపరెప లాడుతూ అదే పేజీలో కాగితం దర్శనమిచ్చింది. పొందికగా, ముత్యాల్లాంటి అక్షరాలతో వ్రాయబడిన ఆ ప్రేమ లేఖను మొదట సంబోధన, చివర రాణి అన్న పేరును చూసి గమనించి, కవి పరిచయం చేస్తూనే జాగ్రత్తగా తన ప్యాంటు జేబులోకి తోసేశాడు. కవి పరిచయం కాగానే, ఒక్కక్షణం ఆగి మనసును నిలకడ చేసుకుని పాఠం చెప్పడంలో లీనమయ్యాడు. గంగా ప్రవాహంలా ఒక 40 నిమిషాల పాటు విద్యార్థుల ప్రతిస్పందనతో పాఠాన్ని ముగించాడు. "Tommorow I will give you the Grammer from this Lesson" అని బయటకు వెళ్ళబోతూ మీకు నెక్ట్స్ పీరియడ్ ఏమిటి? అని అడిగారు. ఎకనామిక్స్ అన్నారు విద్యార్థులు. రాణీ! ఆ క్లాసయ్యాక ఒకసారి నన్ను కలువు, అంటూ సీరియస్‌గా ఆదేశించి, హుందాగా బయటకు నడిచారు రాజారాం.

రాజారాం చాలా బాగా పాఠం చెప్తాడు. ఆంగ్ల సాహిత్యాన్ని క్షుణ్ణంగా చదువు కున్నవాడు. బోధించ డాన్ని వృత్తిగా కాకుండా పాఠం చెప్పడంలోనే ఆనం దాన్ని అనుభవించే ప్రవృత్తి ఉన్నవాడు. అందులోనూ మంచి బోధనా పటిమ ఉన్న వాడు. అతని వాగ్ధాటి అందరినీ ఆకట్టుకుంటుంది. అరటి పండు వొలిచి చేతిలో పెట్టినట్లు సులభంగా అర్థమయ్యేటట్లు చెప్ప గలడు. ఎప్పుడూ తెల్లటి డ్రస్ వేసుకుని, నీట్‌గా ఇన్‌షర్ట్ చేసుకొని, చిరునవ్వులు చిందిస్తూ ఉత్సాహానికి మారు పేరులా ఉంటాడతను. పెద్దవారిపట్ల గౌరవం, తోటి వారిపట్ల స్నేహం, విద్యార్థులపట్ల అభిమానం, అం దరితోనూ కలుపుగోలుగా ఉండడం వల్ల విద్యార్థులకు ఇష్టమయ్యాడు అతని చొరవ విద్యార్థులలో వర్‌షిప్‌ని పెంచింది. రాణి ఆవర్‌షిప్‌ని ఆరాధనగా, ఆపైన ప్రేమగా మార్చుకుంది. అప్పుడే వచ్చిన ఒకానొక సినిమా ప్రభావం వల్లనేమి అలాగే ప్రేమలేఖ వ్రాసి టెక్ట్స్ బుక్‌లో పెట్టి అందించింది ఆరోజు.

స్టాఫ్ రూంకు చేరిన రాజారాం జేబులో నుండి రాణి వ్రాసిన ప్రేమలేఖ తీశాడు. హిస్టరీ లెక్చరర్ ఒక్కరే ఉన్నారు స్టాఫ్ రూంలో. ఆయన సీరియస్‌గా ఏదో జర్నల్ తిరగేస్తున్నారు. ప్రేమ లేఖను చదవడం ప్రారంభించాడు రాజారాం. "మిమ్మల్ని పదే పదే చూడాలని అనిపిస్తుంది. మీ మాటలు పదేపదే వినాలని అనిపిస్తుంది. నా ఆలోచనలు అనుక్షణం మీ చుట్టూనే తిరుగుతుంటాయి. మీరంటే నాకు చాలా ఇష్టం. ఐలైక్ యూ వెరీమచ్. ఐలవ్ యూ సో మచ్. మీ మీద నాకు అపారమైన ప్రేమ వుంది. దానిక్కారణం తెలి యదు. చెట్లు పూవుల నెందుకిస్తాయి. నీరు ఎందుకు ప్రవహిస్తుంది. గాలి ఎందుకు వీస్తుంది. నా హృదయం కూడా అంతే! నాకు మీ దాన్ని కావాలని ఆశ వుంది.

మీరాణి

ఇంటర్ స్థాయిలో ఉన్న ఈ పిల్లకు ఇటువంటి భావాలు సినిమాలు చూడడం వల్లనో, నవలలు చదవడం వల్లనో వచ్చి వుండవచ్చు. స్పందించే మంచి మనసు వుంది. సరియైన దారిలో పెడితే మంచి భావు కత కలిగిన రచయిత కావచ్చు అనిపించిందతనికి. ఈనాటి యువతకు అందుబాటులో మంచి పుస్తకా లుంచి, సరియైన మార్గదర్శకత్వం చేయాల్సిన అవసరం మాత్రం ఉందనిపించింది.

ఆ నాటి దినపత్రిక తిరగేస్తూ కాలక్షేపం చేస్తున్నాడు గాని రాణి వ్రాసిన ఆ లేఖ గురించే ఆలోచిస్తున్నాడు. ఇంతలో రాణి వచ్చి ఎదురుగా నిలబడింది. పేపరు మడిచి టేబిల్‌పై వుంచి, బయటకు రమ్మన్నట్లు సైగచేసి ఎదురుగ్గా ఉన్న చింతచెట్టు వద్దకు నడిచాడు. మంత్ర ముగ్ధలా అతన్నే అనుసరించిందామె. చెట్టు నీడకు చేరగానే జేబులో నుండి ప్రేమలేఖను తీసి ఆ అమ్మాయి కిచ్చి "చూడు రాణీ! సామాన్యంగా లెక్చరర్స్ తమ పని తాము పూర్తి చేసుకుని గంభీరంగా వెడతారు. ఆ తరువాత వాళ్ల వ్యాపకాలు వాళ్ళవి. విద్యార్థులతో ఒక లిమిట్ మెయింటైన్ చేస్తారు. మరో పదేళ్ళ సర్వీస్

పూర్తి చేసి, పెళ్లి చేసుకుని సంసార సాగరంలోకి దిగితే నేనూ అంతే. కాకపోతే ఉద్యోగంలో చేరి ఐదేళ్లు కావడం వల్ల చిన్నవాడిని కావడం వల్ల మొన్నమొన్నటిదాకా యూనివర్శిటీలో ఉండి వచ్చిన వాడిని కావడం వల్ల మీతో సరదాగా, అభిమానంగా ఉంటున్నాను. అందులోనూ నీవు తెలివైన అమ్మాయివని, బాగా చదువుకునే అమ్మాయివని కొంత చనువుగా ఉండి ప్రోత్సహిస్తున్నాను. నా మీద నీకున్న అభిమానాన్ని ప్రేమ అనుకుంటున్నావు. అదీ నీ తప్పుకాదు. ఎదిగీ ఎదగని నీ మనసుది. ఎదుగుతున్న నీ వయసుది. మనది గురుశిష్య సంబంధం. దానికి మనం మచ్చ తేకూడదు. నేనిక్కడ నాకున్న గౌరవాన్ని నిలుపుకోవాలి. అందరికీ నాపట్ల వున్న నమ్మకాన్ని కాపాడుకోవాలి. యాజమాన్యానికి, నాతోటి అధ్యాపకులకు నామీద ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. నన్ను అర్థం చేసుకో, దయచేసి ఈ వ్యవహారానికి ఇంతటితో ఫుల్‌స్టాప్ పెట్టు.

ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా, ఆమెను మాటాడనీయకుండా తన మనసులోని భావాలను సూటిగా, స్పష్టంగా చకచకా చెప్పుకుపోయాడు. ఈ పరిస్థితి అతనికి బాధను కలిగించింది. భయపెట్టింది. తాను విద్యార్థులను ఎప్పుడూ మంచిగానే చూశాడు. విద్యార్థులకు ఇటువంటి ఆలోచనలు కలిగే అవకాశం ఏనాడూ ఇవ్వలేదు. ఈ అమ్మాయి ఇలా ప్రవర్తించడానికి తానేమైనా కారణమా అని స్టాఫ్ రూంలో పేపరు చూస్తూ తెగ ఆలోచించాడు. తానెప్పుడైనా అటువంటి అవకాశం ఇచ్చేలా ప్రవర్తించానా అని తరచి ఆత్మవిమర్శ చేసుకున్నాడు. బాగా చురుకైన అమ్మాయి అని ఆమెను బాగా ప్రోత్సహించాడు. ఎక్కువగా మెచ్చుకోవడం, చనువు ఇవ్వడమేమో అని తోచింది. అందుకే స్పష్టంగా ఆమెకు అలా లేఖ వ్రాయడం తప్పు అని చెప్పి నిలదీశాడు.

అతని మాటలకు కొంత భయపడింది. అతని మొహం అంత సీరియస్‌గా ఉండడం కాలేజీలో చేరాక ఈ ఏడాదిన్నరలో ఎప్పుడూ చూడలేదు. తనను అపార్థం చేసుకున్నా రేమో అనుకుందామె. అందుకే ధైర్యాన్ని కూడదీసుకుని, మాటలు కలగలిపి, మెల్లగా "మా అమ్మా నాన్నలకు చెప్పి, ఒప్పించి పెళ్ళి చేసుకోవాలనే ఉంది సార్. అందుకే మీ అభిప్రాయం కోసం..." అంటూ ఏదో చెప్పబోయింది. ఆయన మధ్యలోనే అందుకొని "నన్ను పూర్తిగా చెప్పనీయమ్మా! నా మీద నీకున్నది ప్రేమ కాదు వర్‌షిప్. It is an admiration అంతే. నిజంగా మనం పెళ్లి చేసుకుంటే ఓ పదేళ్లలోపే నాలో చిన్న చిన్న లోపాలు కనిపించి, అవి. పెద్ద పెద్ద తప్పులుగా అనిపిస్తాయి. అప్పుడే మంటావో తెలుసా! ఆనాడు తెలియక, అయోమయ కత్వంతో మీ మాటలు నమ్మి, మీ వలలో పడ్డాను, నా గొంతు నేనే కోసుకున్నాను అంటావు. ఇలాంటి విషయాలలో బాగా ఆలోచించి, నిర్ణయాలు తీసుకోవాలి అంటుండగానే అతని మాటలను మధ్యలోనే అందుకొని నేను అలా అనను. బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాను. దృఢంగా అందామె. తనని చిన్న పిల్లని చేసి, మాష్టారు అలా మాట్లాడ్డం నచ్చలేదామెకు. తన నిర్ణయం సరియైనదనే భావనలో ఉందామె.

ఇక్కడ లెక్చరర్‌గా పనిచేస్తూ తండ్రిలాంటి గురుస్థానంలో ఉండి నిన్ను పెళ్ళి చేసుకోవడం వినడానికీ, చూడ్డానికీ బావుండదు అన్నాడు అయిష్టంగా. ఆ అమ్మాయి అలా ఉత్తరం వ్రాయడం, అటువంటి ఫీలింగ్ కలిగి ఉండడం అతనికి ఇష్టం లేదు. ఉపాధ్యాయ వృత్తి చాలా గౌరవప్రదమైనదీ, పవిత్రమైనదీ అని అతని విశ్వాసం. అందుకే ఏరికోరి ఎంచుకొని ఈ వృత్తిలోకి వచ్చాడతను. అలా అయితే కాలేజీ మానేస్తాను. ఠక్కున అంది ఆ అమ్మాయి. ఆ మాటలో స్థిరత్వం కూడా ఉంది. పెళ్ళిచేసుకోక తప్పదన్నట్లుందామె ప్రవర్తన.

## గురుశిష్యుల మైత్రి

మనసా వాచా కర్మణా ఉండాలి త్రికరణశుద్ధి
విద్యావినయం గురువు ద్వారానే సంసిద్ధి
అప్పుడే శిష్యునికి సంప్రాప్తిస్తుంది బుద్ధి

గురువులేని విద్య గుడ్డి విద్య
గురుబోధనతో లభించు ఉన్నతమైన విద్య
లేదంటే విద్యాన్వేషణలో అదొక మిథ్య

శిష్యునికి కావాలి సంపూర్ణ శరణాగతి
గురుతత్వంలో తరించిపొందు సద్గతి
అప్పుడే సాధకునికి నిజమైన సుకృతి

ఎక్కడైతే ఉంటుందో గురుశిష్యుల మైత్రి
అక్కడే పవిత్రతను పొందుతుంది ధాత్రి
సచ్ఛీలత లేకుంటే సమస్తం కాళరాత్రి

**-కనపర్తి రాజశేఖరమ్**

ఒక్క క్షణం ఆలోచించాడు.

"నీ ఇష్టం చెప్తున్నావు. మరి నేనిష్టపడవద్దా" అన్నాడు బింకంగా.

అవన్నీ, నాకు తెలియవు. నేను చేసుకుంటే మిమ్మల్నే చేసుకుంటాను. లేకుంటే లేదు... మొండికేసినట్లు మాట్లాడిందామె.

ఆ మొండితనం వద్దు. అది మంచిదికూడా కాదు. నా మనసు కూడా నీవు తెలుసుకోవాలి. నాకు చాలా సమస్యలున్నాయి. అందుకే ఆడపిల్లకు 18 ఏళ్లు దాటాకా పెళ్ళి చేయాలని అన్నారు పెద్దలు. నన్నడిగితే 20 ఏళ్లు దాటాలి. అప్పుడు మైండ్ మెచ్యూరిటీ వుంటుంది అన్నాడు టాపిక్‌ని డైవర్టు చేసి, వాతావరణాన్ని తేలిక చేయాలని.

అవన్నీ నాకు చెప్పవద్దు. మా నాన్నగారు నా మాట కాదనరు. నేను మాత్రం మిమ్మల్నే చేసుకుంటాను. స్థిరంగా అందామె. ఈనాటి సినిమా ప్రభావం ఆ అమ్మాయి మీద అందరిమీదలాగానే బాగా పడింది తాను అని మళ్లీ ఇంకోసారి అనుకున్నాడు తనలో తాను రెండు జేబుల్లో చేతులు పెట్టుకొని, పైకి చూస్తూ కాస్తంత ఆలోచించాడు. ఇలాంటి వ్యవహారాలను సున్నితంగా డీల్ చేయాలి. 'ఆ అమ్మాయి హర్ట్ కాకూడదు. పదవ తరగతి వరకు అమాయకంగా ఉంటారు. ఏం చెప్పినా, ఎవరు చెప్పినా వింటారు. డిగ్రీకి వచ్చేసరికి అవగాహన కలిగి వుంటారు. చెప్పింది విని, ఆలోచిస్తారు. ఈ ఇంటర్ స్టేజి అటూ ఇటూ కానిది. ఇంతవరకు ఎంత వివరంగా చెప్పినా ఆ అమ్మాయి వినడం లేదు. తన మొండితనం వీడలేదు. అవును, మొండివాడు రాజు కన్నా బలవంతుడు. ఒక నిర్ణయానికి వచ్చాడు. తలవంచి, ఆమె వైపు చూశాడు. తలవంచుకుని నోటిలో చింత చిగురు ఆకుని పెట్టుకుని, ఆర్ట్ సినిమాలో హీరోయిన్‌లా కుడి కాలిబొటన వ్రేలితో నేలమీద గీతలు గీస్తోంది. అతనికి నవ్వొచ్చింది ఆమెను చూసి.

"ఆల్‌రైట్! సరే. నీకు నా మీద ప్రేమ ఉందిగా. నా భార్య డిగ్రీ లేదా పిజి చేసి ఉండాలని నా కోరిక. పెళ్లయితే చదువు సాగదు. అలా చేయడం నా కిష్టం లేదు. నాకు కుటుంబ విషయంలో కొన్ని బాధ్యతలున్నాయి. రెండు మూడేళ్ళలో వాటిని పరిష్కరించుకుంటాను. ఐదేళ్ళపాటు బాగా చదివి పిజి చేయి. నిన్ను తప్పకుండా పెళ్లి చేసుకుంటాను అని హామీ ఇచ్చాడు.

ఆమె మనసు కాస్తంత శాంతించింది. రాజారాం మాటల్లో మాయ, మోసం ఉండదు. నిజాయితీ ఉంటుంది. అది అతని వ్యక్తిత్వం అని అందరికీ తెలుసు. ఐదేళ్ల తర్వాత తనను కాదనడనే నమ్మకం ఆమెకుంది. ఐనా సరే మీరు నన్ను మాయ చేస్తున్నారు, చిన్న రాయి విసిరింది. అతని నుండి స్పష్టమైన హామీ కోరుకుంటూ. "లేదు. ఐదేండ్ల తరువాత నా హామీని నేను నిలబెట్టుకుంటాను. నీవు పిజిదాకా బాగా చదవాలి. నన్ను ఇబ్బంది పెట్టకూడదు. అందరిలాగానే ఒక మంచి విద్యార్థిలా ప్రవర్తించాలి. మన మధ్య జరిగిన వ్యవహారం ఎవరికీ చెప్పకూడదు. లీకేజీ అయిందో నేను మాత్రం ఖచ్చితంగా నిన్ను చేసుకోను, హామీతో పాటుగానే ఆమె కాళ్ళకు, నోటికి సంకెళ్ళు వేశాడు రాజారాం తెలివిగా. ఐదేండ్ల తరువాత ఆమె జ్ఞానం వికసించి, తనపట్ల ఉన్న అభిమానాన్ని - అలాగే ఉంచుకుంటుంది. ప్రేమను పెంచుకోదు అని అతడి నమ్మకం. ఒక వేళ అప్పటివరకు ఆమె ప్రేమను పెంచుకుంటే పెద్దలతో మాటాడి పెళ్లి చేసుకోవాలని కూడా నిర్ణయం తీసుకున్నాడు. పరిణితి చెందిన ఆ ప్రేమ యోగ్యత కలిగినది. ఆమోదయోగ్యమైనది అని అతడి ఆలోచన.

థాంక్యు సర్, థాంక్యు అంటూ సంతోషంగా వెళ్లిందామె.

○○○

రాణి బాగా చదివి ఇంటర్మీడియట్ పరీక్షలు వ్రాసింది. అదే కళాశాలలో డిగ్రీలో చేరాలని నిర్ణయించుకుంది. కాని వేసవిలో రాజారాంకు అక్కడ నుండి నూజివీడుకు బదిలీయైంది. అప్పుడు ఆమె వేసవి సెలవులకని అమ్మమ్మగారి ఊరు శ్రీకాకుళం వెళ్లింది. తాను కాలేజికి రాగానే ఆయన రిలీవ్ అయి వెళ్లినట్లు కూడా తెలిసింది. కళాశాల తెరచిన వారం రోజుల తరువాత ఫేర్‌వెల్‌కు హాజరయ్యాడాయన. విద్యార్థులు చాలా ఘనంగా సత్కరించారు. అందరూ అతన్ని ప్రశంసించారు. రాణి కన్నీరు, మున్నీరుగా ఏడ్చింది. చూడు రాణీ! డిగ్రీ బాగా చదివి, నీకు ఫస్టు ర్యాంకు రావాలి. పిజీలో కూడా గోల్డ్ మెడల్ సాధించాలి. ఉత్తరాలు వ్రాస్తుండు. నీవు నీ మాట నిలబెట్టుకో. నేను నా నామాట నిలబెట్టుకుంటాను అన్నాడు హామీని గుర్తు చేస్తూ.

ఆ మాటలకు రాణి పొంగిపోయింది. సంతోషంగా నూజివీడుకు సాగనంపింది.

○○○

కొన్ని సమస్యల్ని మనం పరిష్కరించుకుంటాం.

కొన్ని సమస్యల్ని కాలం పరిష్కరిస్తుంది. వాటిని కాలానికే వదిలేయాలి. అంటే మొదట్లో ఒకటి రెండు సంవత్సరాల పాటు రాణి నుండి ఉత్తరాలు తెగ వచ్చేవి. డిగ్రీ ఫైనల్‌కు వచ్చాక రెండు నెలలకొక మారు ఉత్తరం వచ్చేది. బాగా చదవాలని, టైం వేస్టు చేయవద్దని, అనుకున్న లక్ష్యాన్ని చేరే కృషి చేయాలని తాను ప్రతి స్పందించే వాడు. ఆ తరువాత రాణి పిజికై హైదరా బాదు చేరింది. తాను నూజివీడు నుండి రంపచోడ వరం అక్కడ నుండి డిగ్రీ కాలేజి ప్రమోషన్ పొంది రాయలసీమకు వెళ్లాడు. ఏడాదికొకటి రెండు ఉత్తరాలు, గ్రీటింగ్స్ అందేవి ఆయా సందర్భాల్లో. ఆ తరువాత అనుకోకుండా ఉత్తరాల ప్రహసనం ఆగింది. పిజీ అయ్యాక రాణి నుండి లేఖలు లేవు. తాను బిజీ అయ్యాడు రాజారాం. ఆపైన పెళ్ళి కూడా చేసుకున్నాడు. పదేళ్లకుపైగానే కాలం గడిచింది.

ООО

ఇంటికి వచ్చిన మిత్రుడిని బస్సెక్కిద్దామని బస్టాండుకు చేరిన రాజారాం బుక్‌స్టాల్ వద్ద నిలబడి ఏదో పుస్తకాన్ని తిరగేస్తున్న రాణిని చూశాడు. అనుకోకుండా. అవునా, కాదా అనుకుంటూ వెళ్లి రాణి, అనగానే తలపైకెత్తి, చూసి ఆశ్చర్యంతో...

"సార్..." అంటూ ఎగిరి గంతేసింది.

"ఆశ్చర్యపోవలసింది నీవు కాదు నేను. అది సరేగాని ఏమిటిలా వచ్చావు. ఆశ్చర్యం అన్నాడు తాను.

ఇక్కడ ఒక ఫ్రెండ్ పెళ్లికి వచ్చాను అన్నది చేతిలో వున్న పుస్తకాన్ని బ్యాగ్‌లో పెడుతూ.

'ఇంటికి వెడదాం పద. అక్కడ అన్ని విషయాలు మాట్లాడుకోవచ్చు అంటూ" బయటకు నడిచాడు.

ООО

స్కూటర్ దిగి అభిమానపూర్వకంగా భుజం మీద చేయివేసి ఇంట్లోకి నడిపించి, హాల్లోకి రాగానే, సంతోషంగా వంటింటి వైపు చూస్తూ 'సుమా! ఇలా రా ఎవరొచ్చారో చూడు' అంటూ భార్యను పిలిచాడు. 'ఒక్క నిమిషం. వస్తున్నానండీ!' అంటూ వంటింట్లో నుండి వచ్చిన భార్యతో "నేను చెప్పానే నా ప్రియతమ విద్యార్థిని రాణి! అంటూ పరిచయం చేశాడు. మీరు మాట్లాడుతుండండి. ఇప్పుడే వస్తాను అంటూ రాణికి అతిథి మర్యాదలకై కిచెన్‌లోకి నడిచింది.

ఆ! ఇప్పుడు చెప్పు ఎంతవరకు వచ్చింది నీ చదువు అంటూ సోఫాలో కూర్చున్న రాణి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

పిజిలో గోల్డ్ మెడల్ అందుకున్నాను సార్! ఆ తరువాత పిహెచ్‌డిలో జాయినయ్యాను. పూర్తయింది. మొన్ననే హైదరాబాదులోని జిపి డిగ్రీ కాలేజిలో లెక్చరర్‌గా చేరాను అన్నది ముచ్చటగా మూడు వాక్యాల్లో.

వెరీగుడ్. కంగ్రాచ్యులేషన్స్ అన్నాడు ప్రశంసా పూర్వకంగా.

కరచాలనం చేస్తూ చెప్పాడు. ఆ వెంటనే మరి పెళ్లి, అన్నాడు సూటిగా ఆమె కళ్ళలోకి చూస్తూ. ఇంత వేగిరంగా ఆ ప్రశ్న వదులుతాడని ఆమె అనుకోలేదు. ప్రశ్న వేయగానే "నాతో పిహెచ్‌డి చేసే శ్యామసుందర్ గారితో సెటిలైంది సార్. ఆయన ఎంఎల్ కాలేజిలో లెక్చరర్‌గా చేస్తున్నారు. పెళ్లి ఈ వేసవిలో కావచ్చు. నిశ్చితార్థం మొన్ననే అయింది అంది సిగ్గుతో తలవంచి. బుగ్గల్లో పెళ్లి తాలూకు భావాలు కనిపిస్తున్నాయా అంటూ తొంగి ఆమె చెంపల వైపు చూశాడు.

అతనలా గమనించగానే పొండి సార్. అంటూ తల ప్రక్కకు తిప్పింది. డబుల్ కంగ్రాట్స్. ఐ యామ్

## అక్షరాయ నమః

నీ అడుగులో అడుగిడు
అక్షరపదాలు అందం
నీ చూపుల్లో చరించు
అక్షర ముత్యాలు చందనం
నీ నరనరాల్లో నర్తించు
అక్షరాలు నందనం
నీ మాటల సుధలో కురియు
అక్షర పదాలు సుమధురం
నానీలపై నాట్యమాడు
అక్షరాలు నవ్యతరం
నీ వేళ్ళ కదలికల కదిలే
కవితాక్షరాలు కదురమ్యం
నీ నోటి నుండి వింటే
అక్షరాలు నూతనత్వం
నీ మనసారా నిండే
అక్షరాలు మధురాతిమధురం
నీ అక్షరాలకు అభివందనం
నీ అక్షర పదాలకు పాదాభివందనం

-రాంబత్రి గంగాధర్

వెరీ హ్యాపీ. మరోసారి అని షేక్ హ్యాండిచ్చి మరి నా సంగతి అన్నాడు చిలిపిగా. "మీరు పెళ్ళి చేసుకున్నారుగా. కనీసం నాకు ఇన్విటేషన్ కూడా పంపలేదు. పైగా మాట తప్పారు కూడా" అన్నది ఉక్రోషంగా ముక్కు పుటాలు ఎగరేసి.

అంతలో అతని భార్య సుమలత జ్యూస్ తీసుకు వచ్చింది.

"నన్ను ప్రేమించిన మొదటి అమ్మాయి ఈవిడే సుమా! నీకు నేను ఈమె గారి గురించి, మరో అమ్మాయి అనూరాధ గురించి చెప్పాను గదా! మొన్నామధ్య మనింటికి వచ్చింది గదా. ఆ మహాతల్లి అనూరాధ ఆవిడగారు. డాక్టరై, మరో డాక్టర్ని చేసుకుంది ఈవిడగారు డాక్టరేట్ చేసి మరో డాక్టరేట్‌ను చేసు కుంటున్నది. వీళ్ళకోసం ఆగితే నేనేమయ్యేవాడినో ఏమో అన్నాడు వేళాకోళంగా.

"సార్, ఐదేళ్లు ఆగాక చేసుకుంటాను అని హామీ ఇచ్చి నాకు చెప్పకుండా పెళ్లి చేసుకుని మోసం చేశారు మేడం, అన్నది తల ఎగరేస్తూ తన తప్పేమీ లేదన్నట్లుగా.

ఆయనగారి సంగతి నాకు బాగా తెలుసు మాయ గాడు సుమా! అన్నది సుమలత రాణిని సపోర్టు చేస్తూ.

"నాకు తెలుసు రాణీ! ఎదిగీ ఎదగని వయసులో మనతో కాస్తంత చనువు ప్రదర్శించినా, అభిమానంగా ఉన్నా అదే ప్రేమ అనుకుంటారు. దాని కనుగుణమైన పరిసరాలు, సినిమాలు, మన వయస్సు అలాగే అనిపిస్తాయి. అప్పుడే కాస్తంత జాగ్రత్త పడాలి. బాగా చదువుకుని, సమాజాన్ని అర్థం చేసుకొని, పరిస్థితులను ఆకళింపు చేసుకున్నాక మనం ఎవరిని కోరుకున్నా, మనల్ని ఎవరు కోరుకున్నా అది నిజమైన ప్రేమ. అది నిలకడగా ఉంటుంది. అందుకే 20-25 ఏళ్ల మధ్య వివాహం చేసుకోవాలని నేను అంటాను. పరిణతి చెందిన వయస్సులో తీసుకునే నిర్ణయాలు చాలా వరకు బాగుంటాయి. ముఖ్యంగా గురుశిష్య సంబంధం చాలా పవిత్రంగా వుండాలి. ఒక వేళ ఇంటర్ చదువుకునే రోజుల్లో అటువంటి ప్రేమ భావన కలిగినా చదువు పూర్తయ్యాకే వివాహం, అన్నీను అనే నిర్ణయాలు తీసుకుంటే ఇప్పటి యువతకు మంచే కలుగుతుంది. ఆ ప్రేమ పెద్దయ్యాక వయసుతో పాటే పెరిగితే స్థిరపడ్డాక పెళ్ళి చేసుకుంటే అందరికీ బాగుంటుంది. అందుకే ఆనాడు నీకు ఆ గడువు పెట్టాను అన్నాడు రాజారాం సుదీర్ఘమైన తన ప్రసంగంలో.

"స్వామీ! అలవాటు ప్రకారం ఒక పీరియడ్ క్లాసు తీసుకుని అలసిపోయారు. ఇక ఆ జ్యూస్ తీసుకోండి" అంది సుమలత హాస్యంగా.

మీరు చెప్పిందే నిజం సార్ అంది గౌరవం ఉట్టిపడే స్వరంతో.

నేను వంట చేస్తాను. ఈలోగా రాణిని షాపింగ్‌కు తీసుకెళ్లి మంచి డ్రస్ కొని పెట్టండి. ఆమె ఫ్రెండ్ పెళ్లి రేపు కాబట్టి ఈ రాత్రికి మన ఇంట్లోనే బస. రాత్రి తెల్లవార్లు కబుర్లన్నీ కలబోసుకోవచ్చు అంది సుమ గ్లాసులు తీసుకుని లోపలికి నడుస్తూ. చిత్తం మేడం. తమరి ఆజ్ఞ అంటూ ముందుకు కదిలాడు. ■

## అంపశయ్య

ఏ దృశ్యాన్నీ అందుకోలేని చూపుల్ని
కనురెప్పలు కత్తిరించుకోగానే
గుండెలో
కత్తిపడవ కదలాడుతుంటుంది

మనసు చేజారి
ప్రతిబింబాలు గుచ్చుకుంటున్నాయి
కలలు చిట్లి
రాత్రంతా స్రవిస్తూనే వుంది

ఆశల అలలు
దిగులుగా నీడల్ని వెదుకుతూ
తీరాన్ని అవతలకు నెట్టుతున్నయి
గాలిలో కలిసేపాటని
ఒడిసి పట్టుకోటానికి
వసంతం
గడిచిన రుతువయింది
ఎన్ని మలుపుల్లో
యీ నది
వెలుగు నింపుకుందో
కడలి గర్భంలో అంతా చీకటే!
అన్ని మాటలూ
ఒకే అర్థాన్నిస్తున్నప్పుడు
మీద బోర్లించుకున్న బతుకు కింద
ఏకాకి తనమే
గొప్ప అవసరమవుతుంది

-లంకా వెంకటేశ్వర్లు